# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

11 హైదరాబాద్, సోమవారం 25 మార్చి 2024 HYDERABAD




సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను కలిసిన మాజీ మంత్రి మహమూద్ అలీని ఆలింగనం చేసుకుంటున్న దృశ్యం. చిత్రంలో ఎమ్మెల్యేలు మాగంటి, కాలేరు, కార్పొరేటర్లు

## లోన్ యాప్ నిర్వాకం

### మార్ఫింగ్ వీడియోలో యువతికి వేదింపులు

వెంగళరావునగర్, మార్చి 24 : లోన్ కోసం ఆన్‌లైన్‌లో వెతికిన ఓ యువతిని సైబర్ నేరగాళ్లు మార్ఫింగ్ చేసిన వీడియోలతో వేదింపులకు గురిచేయడంతో ఎస్ఆర్ నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ఓ హాస్టల్‌లో ఉంటున్న యువతి (24) ఆదివారం ఉదయం గూగుల్ ప్లే స్టోర్ నుంచి క్రెడిట్ స్పార్క్ లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. రుణానికి 50శాతం వడ్డీ కట్టాలని, తీసుకున్న మొత్తాన్ని 7 రోజుల వ్యవధిలో చెల్లించాలని నిబంధనలు ఉండటంతో యాప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసింది. అయినప్పటికీ యువతి ఖాతాలో రూ.4800 క్రెడిట్ అయ్యాయి. దీంతో బాధితురాలు యాప్‌లోని నంబరుకు ఫోన్ చేసి తన అనుమతి లేకుండా రుణం ఎందుకు పంపారని ప్రశ్నించడంతో రిటన్ చేయాలని యాప్ నిర్వాహకులు యూపీఐ ఐడీ పంపారు. మొత్తం నగదును తిరిగి చెల్లించగా.. రూ.3200 వడ్డీ కూడా చెల్లించాలని ఫోన్ చేసి డిమాండ్ చేశారు. వడ్డీ చెల్లించకుంటే మార్ఫింగ్ వీడియోలను ఆన్‌లైన్‌లో పోస్టు చేసి బెదిరించారు. దీంతో బాధితురాలు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుడు పోని కరెంటు..
# ఇప్పుడెందుకు పోతుంది.?

- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌కు చేసింది శూన్యం
- నియోజకవర్గం అంతా నా ఇళ్లు.. ప్రజలంతా నా కుటుంబ సభ్యులే
- మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- దానం నాగేందర్ గురించి మాట్లాడాలంటే సిగ్గనిపిస్తుంది
- సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మార్చి 24 : ప్రజల ఆశీర్వాదం పద్మారావుగౌడ్‌కు ఉన్నదని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తాడని సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పద్మారావు గౌడ్‌ను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పద్మారావు నివాసంలో సమావేశమయ్యారు. ముందుగా ఆయనకు అభినందనలు తెలిపి ఎన్నికల ప్రచార కార్యాచరణపై చర్చించారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, నేతలు ముఠా జైసింహ, మన్నె గోవర్ధన్‌తో సహా ఏడు నియోజకవర్గాల నేతలు, కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రెండు రోజుల్లో తెలంగాణ భవన్‌లో పూర్తి స్థాయి సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ప్రకటిస్తామని తెలిపారు.

**అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు**

సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ ప్రజలు శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ అంటే గుర్తు పట్టనివారు ఉండరని, ప్రజలకు సేవ చేయడంతోనే తమకు పేరు వచ్చిందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు డైనమిక్ ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పోని కరెంటు ఇప్పుడు ఎందుకు పోతుందని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని తెలిపారు. కిషన్ రెడ్డి ఈ ప్రాంతానికి చేసిందేమి లేదన్నారు. గల్లీ లీడర్లు లేనిది ఢిల్లీ ఎక్కడిదని పద్మారావు ప్రశ్నించారు. మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. దానం నాగేందర్ గురించి మాట్లాడాలంటే సిగ్గనిపిస్తుందని, ఎప్పుడూ పార్టీ మారుతూనే ఉంటాడని విమర్శించారు.

**భారీ మెజార్టీతో పజన్న గెలుపు ఖాయం : తలసాని**

సికింద్రాబాద్ అభ్యర్థిగా పద్మారావు గౌడ్‌ను అధ్యక్షుడు కేసీఆర్ ప్రకటించగానే ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లో జనరల్ బాడీ మీటింగ్ పెట్టుకొని ప్రజల్లోకి వెళ్లి, ఓటు అభ్యర్థిస్తామని తెలిపారు.

**రేవంత్ రెడ్డి అబద్ధాల ముఖ్యమంత్రి : మాజీ హోంమంత్రి**

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తుందని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రైతు బంధు, రైతు భరోసాపై ప్రభుత్వం నుంచి సంకేతాలు లేవన్నారు. రేవంత్ రెడ్డి అబద్ధాల ముఖ్యమంత్రి అన్నారు. ఉద్యమకారుడైన పద్మారావు గౌడ్‌ను అందరం కలిసి భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

**దానం ఏ పార్టీలో ఉంటాడో తెల్వదు**

దానం నాగేందర్ ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెల్వదని, గెలిచినా కాంగ్రెస్ పార్టీలో ఉంటాడనే గ్యారెంటీ లేదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కేంద్ర మంత్రి గా ఉన్న కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధిని విస్మరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత ముషీరాబాద్ యువ నేత ముఠా జైసింహ, ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్, యువ నేత రామేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





చేవెళ్ల సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, యాదయ్య, ఎమ్మెల్సీలు ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎగ్గే మల్లేశం, దయానంద్ గుప్త, డీసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, హాజరైన నాయకులు

# గులాబీదే గెలుపు

## సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ..
## జోరుగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల ఎన్నికల సన్నాహక సమావేశాలు

**కేసీఆర్‌ను నిషాన లేకుండా చేస్తావా.?**
**రేవంత్ నీకెందుకింత అహంకారం.?**

- విమర్శలు మాని.. ప్రజా సేవచెయ్యి
- నువ్వు రాకపోకలు సాగించే ఫ్లైఓవర్లు.. కేసీఆర్ వేసినవే.. కనిపిస్తలేవా.?
- రంజిత్ రెడ్డికి గుణపాఠం చెప్పాలి
- కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు వాగ్దానాలను నమ్మి మరోమారు మోసపోవద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించుకుందాం
- సన్నాహక సమావేశంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- సేవ చేసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి..
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్ ముదిరాజ్



బడంగ్‌పేట, మార్చి 24: చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలిపిస్తే సబండ వర్గాలకు సేవ చేస్తానని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేందర్‌నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎగ్గే మల్లేశం, బుగ్గారపు దయానంద్ గుప్తా, తదితరులు హాజరయ్యారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి.. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని శపథం చేశారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, కార్యకర్తలు శ్రమించకుండా ఏ లీడర్ గెలువలేడన్నారు. గతంలో జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసి ఎంతో మార్పు తీసుకొచ్చానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఆర్కేపురం అధ్యక్షుడు నాగేశ్, మహేశ్వరం అధ్యక్షుడు రాజునాయక్, కందుకూరు అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, తుక్కుగూడ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, జిల్లెల కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రెండు నెలలు కష్ట పడుదాం**

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతో సేవ చేశారు. ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిస్తాం. ఎంపీ రంజిత్ రెడ్డి ఐదేండ్ల కాలంలోనే కోట్ల రూపాయలు సంపాదించుకొని పార్టీ మారారు. గత పదేండ్లలో లేని కరువు.. రెండు నెలలు కష్ట పడుదాం.. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరిద్దాం. కాసానిని ఎంపీగా గెలిపించుకుందాం. ఐదు సంవత్సరాలు పనిచేయించుకుందాం.

– ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య

**కాంగ్రెస్ వచ్చింది.. జనరేటర్లు తెచ్చింది**

కాంగ్రెస్ పాలన వందరోజులు కాక ముందే జనరేటర్లు తీసుకువచ్చింది. ప్రజలందరినీ అంతర్మథనంలో పడేసింది. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్రజా సంక్షేమ పథకాలను అన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తున్నది. కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీజేపీ చేస్తున్న ఆరాచకాలను, కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలి.

– ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, వాణీదేవి, దయానంద్ గుప్తా

## మార్పంటే.. పంట ఎండబెట్టడమేనా..?

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార పూరితంగా మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కోసం 14 సంవత్సరాలు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను నిషాన లేకుండా చేస్తావా.?ఎందుకు ఇంత అహంకారమని రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కరెంటు కోతలు, రైతుల పంటలు ఎండబెట్టడం, రైతుబంధు నిలిపివేత ఇలా అనేక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. కేసీఆర్ ఏం చేశాడో రేవంత్ రెడ్డికి కనిపిస్తలేదా..? రేవంత్ రాకపోకలు సాగిస్తున్న ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, విశాలంగా మారిన రోడ్లు కేసీఆర్ వేసినవేనని తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లలో కేసీఆర్ కన్పిస్తున్నడు, రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు, ఇలా అనేక సంక్షేమ పథకాల రూపంలో కేసీఆర్ కన్పిస్తున్నడన్నారు. కేసీఆర్ పెట్టిన భిక్షతో రంజిత్ రెడ్డి చేవెళ్లకు ఎంపీగా గెలిచారని, అంతకు ముందు ఎవరికీ తెలియదన్నారు. భిక్ష పెట్టిన కేసీఆర్‌నే స్వార్థంకోసం మోసంచేసి కాంగ్రెస్‌లో చేరారని.. ఇలాంటి మోసకారి రంజిత్ రెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌కు కాసాని జ్ఞానేశ్వర్ సుపరిచితుడని తెలిపారు. గతంలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్సీగా 96 కులాల గొంతుకగా పనిచేసిన నిబద్ధత గల నాయకుడికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి 60వేల మెజార్టీ ఇద్దామని, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలను నమ్మి మరోమారు మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

## ఓటేసి.. ఆశీర్వదించండి..

- బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి
- మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- పీర్జాదిగూడలోని శాంతివనం, నందనవనంలో వాకర్స్‌తో మాటామంతీ

పీర్జాదిగూడ, మార్చి 24 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శాంతివనం పార్కు, నందనవనం పార్కులలో స్థానిక మేయర్ జక్క వెంకట్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వాకర్స్‌కు వివరించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మాల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎంపల్లి అనంత రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పీర్జాదిగూడలోని నందనవనం పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు



## జలవిహార్‌లో.. జలకాలాట

నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో ఆదివారం నగరవాసులు పిల్లాపాపలతో సందడి చేశారు. స్విమ్మింగ్‌పూల్‌లో జలకాలాడుతూ.. ఉత్సాహంగా గడిపారు.

## టీ హబ్‌ను సందర్శించిన క్యాప్ జెమిని సీఈఓ

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఐటీ సంస్థ క్యాప్‌జెమిని గ్రూపు సీఈఓ ఏమన్ ఇజ్జట్‌తో పాటు కంపెనీ ప్రతినిధుల బృందం టీహబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీ హబ్ సీఈఓ ఎం.శ్రీనివాస రావు వారితో సమావేశమయ్యారు. టీ హబ్ కేంద్రంగా ప్రారంభమైన టెక్నాలజీ స్టార్టప్‌ల పనితీరును వారికి ప్రత్యేకంగా వివరించారు. స్టార్టప్‌లకు కార్పొరేట్ సంస్థల సహకారం అవసరం ఉన్నదని, అదేవిధంగా సరికొత్త ఆలోచనలతో ప్రారంభించిన స్టార్టప్‌ల వ్యవస్థాపకులకు మార్గదర్శకులు (మెంటార్స్)గా పనిచేయాలని కోరారు.



## దంచికొడుతున్న ఎండలు..

**ఉక్కపోతతో.. నగరవాసుల ఉక్కిరిబిక్కిరి**

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : దక్షిణ దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు సైతం సాధారణ స్థాయి కంటే ఎక్కువగా నమోదవుతుండడంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37.2డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26.7డిగ్రీలు, గాలిలో తేమ 26శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.


